RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 419 | 10 శుక్రవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణ నా కల

## : సీఎం రేవంత్ రెడ్డి

- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, వెబ్‌సైట్ ప్రారంభం
- కొత్త క్రీడా పాలసీతో క్రీడారంగానికి ప్రోత్సాహం
- గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో క్రీడలు వెనుకబడ్డాయని వ్యాఖ్య
- నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న తెలంగాణ



హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడమే తన వ్యక్తిగత కల అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ'తో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను తిరిగి ఒక ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రస్థానంలో ఇదొక కీలక ముందడుగు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 1990 నుంచి 2004 మధ్య కాలంలో హైదరాబాద్ అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా నిలిచిందని, అయితే గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో అటువంటి మెగా ఈవెంట్లు జరగకపోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో నూతన క్రీడా విధానాన్ని రూపొందించామని తెలిపారు. ఇందులో భాగంగానే వచ్చే నవంబర్‌లో 'ఖేలో ఇండియా' గేమ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. అపారమైన జనాభా కలిగిన భారతదేశం ఒలింపిక్ పతకాల సాధనలో వెనుకబడి ఉండటంపై రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల విధానపరమైన లోపాలే ఇందుకు ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. చిన్న వయసులోనే ప్రతిభావంతులను గుర్తించి, వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఉపాధికి, ఉజ్వల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. 2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్ తరపున బిడ్ దాఖలు చేయాలని లేదా భారత్‌కు ఆ అవకాశం దక్కితే కనీసం కొన్ని క్రీడా విభాగాలనైనా ఇక్కడ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే గచ్చిబౌలి స్టేడియాల ఆధునికీకరణ, నూతన స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి : కవిత



బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం" అని స్పష్టం చేశారు.

## హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే.. కేసీఆర్ ఎందుకు తీసేశారు?

### : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్!



సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇరిగేషన్‌లో హరీశ్ రావు ఏదో పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "హరీశ్ రావుకు అంత సత్తా ఉంటే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆయనను ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీశ్ రావు పనితీరుపై నమ్మకం లేకనే కేసీఆర్ ఆయనను రాత్రికి రాత్రే నీటి పారుదల శాఖ నుంచి తీసేశారు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా హరీశ్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని, ఆయన చూపించిన అబద్ధపు గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. హరీశ్ రావు చేసిన ప్రతి విమర్శకు సరైన సమయంలో, ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెబుతామని మంత్రి స్పష్టం చేశారు.

## కడియం శ్రీహరిది కపట బుద్ధి..

### నా శాఖను హైజాక్ చేశారు: కొండా సురేఖ



మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. టీవీ9తో మాట్లాడుతూ.. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు. ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు. కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలను ఆయన సహించరని విమర్శించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఉండటం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే గ్రూపు రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు. మరోవైపు కడియం-సురేఖ వివాదాన్ని పరిష్కరిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

## ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన కేసీఆర్ మనవడు హిమాన్షు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మనవడు, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్షు రావు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవల హిమాన్షు వ్యాయామం చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో ఆయన ముక్కుకు స్వల్ప గాయమైంది. దాంతో కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే చికిత్స నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే హరీశ్ రావు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా ఆసుపత్రికి చేరుకుని హిమాన్షును పరామర్శించి, వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం హిమాన్షు తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర



రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
10 శుక్రవారం జూలై 2026

# రాష్ట్రస్థాయికి ఉషోదయ విద్యార్థులు

## జిల్లా స్థాయి ఆట్యాపాట్యా ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను

## అభినందించిన గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ గిరిగాని రాహుల్ వర్మ

గీసుగొండ, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సంపేట మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆట్యాపాట్యా క్రీడా ఎంపికల్లో విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉషోదయ హై స్కూల్ విద్యార్థులు బానోత్ భువన్, సింగిరెడ్డి హన్సిక, చాపర్తి రిత్విక్, మునుకుంట్ల సిరిలను గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ గిరిగాని రాహుల్ వర్మ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, వరంగల్ జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ హై స్కూల్ ప్రిన్సిపల్ చంద్రగిరి మహేష్, వైస్ ప్రిన్సిపల్ వీరన్న, వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు కుంట విజేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి విజయాన్ని కొనియాడారు.




# హుస్నాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## మంత్రి కొండా సురేఖతో మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ..

## దేవాదాయ, అటవీ శాఖలకు సంబంధించిన అంశాలపై వినతిపత్రం..

## సానుకూలంగా పరిశీలించి చర్యలకు హామీ

హైదరాబాద్, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్:
హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి దేవాదాయ, అటవీ శాఖల పరిధిలోని పలు కీలక అంశాలపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు. దేవాదాయ, అటవీ శాఖలకు సంబంధించిన వివిధ ఫైళ్ల ప్రస్తుత స్థితిని మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి కొండా సురేఖకి వివరించారు. నియోజకవర్గ ప్రజలకు మేలు చేకూరే అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ, వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి శాఖాపరంగా అవసరమైన చర్యలను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తన శాఖల పరిధిలో పూర్తి సహకారం అందిస్తామని, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా జరిగిన ఈ భేటీలో దేవాదాయ, అటవీ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై సానుకూల చర్చ జరగడంతో అభివృద్ధి ప్రతిపాదనల అమలుకు మరింత ఊతం లభించనున్నట్లు భావిస్తున్నారు.



# గవర్నర్, మంత్రిని కలిసిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

## - ఎన్ఐటీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వక భేటీ..

## - అభివృద్ధి పనుల నివేదిక పుస్తకం అందజేత





హన్మకొండ, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం హనుమకొండలోని ఎన్ఐటీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్, మంత్రి వర్యులకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కుడా పరిధిలో అమలవుతున్న పట్టణాభివృద్ధి పనులపై రూపొందించిన నివేదిక పుస్తకాన్ని వారికి అందజేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని ఈ సందర్భంగా వివరించినట్లు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చ జరిగినట్లు సమాచారం.

# అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 09:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి నునావత్ రాజేష్ మాట్లాడుతూ, 1949 జూలై 9న స్థాపించబడిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, జాతీయ చైతన్యం, సామాజిక సేవ, విద్యా సంస్కరణల కోసం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు.
“నేషనల్ ఫస్ట్ , సెల్ఫ్‌స్ క్యారెక్టర్ , కనొలెడ్జి , యూనిటీ ” అనే నాలుగు మూల సూత్రాలతో ఎబీవీపీ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.
విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా నాణ్యత పెంపు, సామాజిక బాధ్యత, సేవా కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక రంగాల్లో ఎబీవీపీ సాధించిన విజయాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎబీవీపీ నగర కార్యదర్శి నునవత్ రాజేష్ , గ్రేటర్ హైద్రీబాద్ జాయింట్ సెక్రటరీ రాఘవేంద్ర పొరవ స్టేట్ నాయకుడు ఎం . దేవేందర్ సయ్యాద్,సాయికార్తిక్, రాహుల్, అభిలాష్, రోహిత్ , ప్రణీత్ కార్యకర్తలు, విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొని ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.




# గ్రామాభివృద్ధిపై నేడు ప్రత్యేక శిక్షణ

## గంగదేవిపల్లిలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన..

## హాజరుకానున్న ఎమ్మెల్యే, కలెక్టర్ సహా జిల్లా ఉన్నతాధికారులు

గీసుగొండ, జూలై 9 హైదరాబాద్ ఎస్టేట్:
గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి, నిధుల సమర్థ వినియోగం, ప్రభుత్వ మార్గదర్శకాల సమర్థ అమలు లక్ష్యంగా గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గంగదేవిపల్లి ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, వీబీగ్రామ్‌జీ (ఈజీఎస్), గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన తదితర కీలక అంశాలపై జిల్లా అధికారులు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమానికి పరకాల శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (జెడ్పీ సీఈఓ)తో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు హాజరై మార్గనిర్దేశం చేయనున్నారు. గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గీసుగొండ మండల అభివృద్ధి అధికారి (ఎంపీవో) విజ్ఞప్తి చేశారు.ం

# గవర్నర్‌ను కలిసిన రేవూరి

## హనుమకొండ పర్యటనలో మర్యాదపూర్వక భేటీ..

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కూ ఘన స్వాగతం



హన్మకొండ, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి వరంగల్ ఎన్ఐటీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక స్వాగతం పలికారు. అనంతరం పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు తెలిసింది. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# రెడ్ క్రాస్ సేవలకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి రూ.1,00,116 విరాళం

## గవర్నర్, మంత్రి సమక్షంలో చెక్కు అందజేత




హన్మకొండ, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్:
తలసేమియా బాధితుల వైద్య సేవలు, రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలకు అండగా హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీకి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు, తలసేమియా కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా వారి సమక్షంలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి విరాళం చెక్కును రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్, మంత్రి అక్కడ అందుతున్న వైద్య సేవలు, రక్త నిల్వలు, సంస్థ నిర్వహిస్తున్న మానవతా కార్యక్రమాలను పరిశీలించారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, తలసేమియా బాధిత చిన్నారులు, రక్తం అవసరమైన నిరుపేదలకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కాపాడుకోవాలి దూసకంటి సాయినాథ్




హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 9
రంగారెడ్డి జిల్ల మహేశ్వరం నియోజకవర్గ మండలం కేంద్రాలలో దూసకంటి సాయినాథ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ సార్ కార్యక్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఓటు వివరాలను వరిశీలించుకోవాలని సూచించారు ఓటు హక్కు ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని అన్నారు అర్హులైన ఓటర్ల పేరు జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు వ్యవహరించాలని రాజకీయ పక్షపాతం లేకుండా సవరణ ప్రక్రియను నిర్వహించాలని కోరారు ప్రతి గ్రామంలో వాడు బూతు స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరి గా పరిశీలించాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు ప్రజాస్వామ్యంలో బలోపేతానికి ప్రతి అరుహుడి ఓటు కీలకమని అందరూ తమ ఓటు హక్కును పరిశీలించుకోవాలని బిజెపి పార్టీ దీజీవీ మండల ఉపఅధ్యక్షుడు దోస కంటి సాయినాథ్ కోరారు

# ఊకల్ క్రాస్‌కు ఊరట

## బురద తొలగించిన గీసుగొండ పోలీసులు.. వాహన రాకపోకలకు సౌకర్యం





గీసుగొండ, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్: వరంగల్‌నర్సంపేట ప్రధాన రహదారిపై ఊకల్ క్రాస్ వద్ద పేరుకుపోయిన బురద సమస్యకు పరిష్కారం లభించింది. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న గీసుగొండ పోలీసులు తక్షణ చర్యలు చేపట్టి రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించారు. ఊకల్ క్రాస్ వద్ద లారీ అసోసియేషన్‌కు చెందిన వాహనాలు పార్కింగ్ ప్రదేశం నుంచి రోడ్డుపైకి రావడంతో మట్టి ప్రధాన రహదారిపై చేరి బురదగా మారింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాచారం అందుకున్న గీసుగొండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విశ్వేశ్వర్, ఎస్‌ఐ అనిల్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ అసోసియేషన్ ప్రతినిధులు, డ్రైవర్లు, స్థానికుల సహకారంతో బురద, మట్టిని తొలగించి రహదారిని శుభ్రం చేయించారు. పోలీసుల చర్యలతో వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగుతున్నాయి. ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టిన పోలీసులు, లారీ యజమానులు, డ్రైవర్లు వాహనాలను పార్కింగ్ చేసే సమయంలో మట్టి రోడ్డుపైకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు రహదారులపై ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గీసుగొండ పోలీసులు

# నూతన పోలీస్ కమిషనర్‌కు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అభినందనలు

## వరంగల్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత పటిష్ట చర్యలు చేపట్టాలని ఆకాంక్ష



హన్మకొండ, జూలై 9 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతా రెడ్డి, ఐపీఎస్ ని హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, ఈవి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్. శ్వేతా రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువై, ప్రజలుపోలీసుల మధ్య నమ్మకం, సహకారం మరింత బలోపేతం కావాలని వారు కోరుకున్నారు. నూతన పోలీస్ కమిషనర్ నాయకత్వంలో వరంగల్ నగరంలో శాంతియుత వాతావరణం కొనసాగుతూ, ప్రజా భద్రతకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# బండి భగీరథకు బిగ్ రిలీఫ్ ...




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్
తెలంగాణలో తీవ్ర సంచలనం సృష్టించిన పోక్సో కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథకు బిగ్ రిలీఫ్ దక్కింది. భగీరథ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్ పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు కాసేపటి క్రితం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెల్లడించింది. ఈ కేసులో ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విన్న అనంతరం హైకోర్టు తుది తీర్పును ప్రకటించింది. రూ. లక్ష చొప్పున రెండు వ్యక్తిగత పూచికత్తులు సమర్పించాలని. కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఆదేశించింది. కాగా. మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు బండి భగీరథ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే ఈ క్రమంలోనే దర్యాప్ చేపట్టిన సైబరాబాద్ పోలీసులు మే 16వ తేదీన భగీరథను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అప్పటినుంచి ఆయన చర్ల పెల్లి జైల్లో దాదాపు 49 రోజుల్లో పై జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గారు

## నిజాంపేట్ మండలం ర్యాలమడుగు, మాణిక్ నాయక్ తాండ ఉప సర్పంచ్ రమేష్ గారి వివాహ కార్యక్రమం.

## నిజాంపేట్ మండలం రామ్ రెడ్డి పెట్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య గారి కూతురి వివాహం.

## నిజాంపేట్ మండలం దర్గా తాండాకు చెందిన కిషన్ నాయక్ కుమారుని వివాహం.



నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన మారుతి రెడ్డి గారి కుమారుని వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి గారు వారితోపాటు మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ రెడ్డి, సర్పంచ్ ఈశ్వర్, మాజీ సర్పంచ్లు మాణిక్ రెడ్డి, రాజు నాయక్, రవీందర్ నాయక్, నాయకులు జనార్దన్ రెడ్డి, అశోక్, మల్కొండ, సర్దార్ నాయక్, బంగార్రాజు, కమ్మరి నర్సింహులు తదితరులు ఉన్నారు.

# లక్ష్యసాధనలో విద్యార్థులు ముందుండాలి

## తెలంగాణ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్






హైదరాబాద్, జూలై 09: విద్యార్థులు సరైన లక్ష్యాల్ని ఎంచుకుని శ్రమించి వాటిని చేరుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ సూచించారు. బర్కత్ పుర లోని అవంతి విద్యా సంస్థల ఆద్వర్యంలో 'ప్రవిష్ట – 2026' పేరుతో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ వేదిక కార్యక్రమాన్ని గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల దిల్ సుక్ నగర్ బ్రాంచి ప్రిన్సిపాల్ డాక్టర్ బైస్ స్వాతి, బర్కత్ పుర బ్రాంచి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వేణుగోపాల్ లు కళాశాల సాధించిన ప్రగతి విద్యా నివేదికలను సమర్పించారు. అవంతి విద్యా సంస్థల ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ మాట్లాడుతూ... విద్యా ప్రమాణాలను కాపాడుతూ, ఆవిష్కరణలు, నాయకత్వ సంస్కృతిని పెంపొందిస్తున్నందుకు కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. 'ప్రస్తుత యువత మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి' అని, ఇవి విద్యార్థుల చదువులను దెబ్బతీస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక పరికరాలు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు స్వయం ఉపాధి దిశగా తమ స్వంత స్టార్టప్లను ప్రారంభించాలని కోరారు. కృత్రిమ మేధస్సు (ఏఐ)పై పూర్తిగా ఆధారపడకూడదని ఆయన విద్యార్థులకు సూచించారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... భవిష్యత్తు అంతా యువతరానిదే అని అన్నారు. సాంకేతికతను సానుకూల మార్గంలో ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పొంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యార్థులు కృత్రిమ మేధస్సు పై కాకుండా తమ సహజ మేధస్సు పైనే అధారపడాలని పిలుపునిచ్చారు. కళాశాల డైరెక్టర్ జయప్రద, ఐసిఏఐ చైర్మన్ డి. వెంకట రాంబాబు, ఎల్స్ స్టాఫ్ టెక్నాలజీస్ హెచ్ఎర్ డైరెక్టర్ గరిమా పాండే, బ్రహ్మకుమారీస్ ఇంచార్జ్ డాక్టర్ బికె శ్రీలత, కళాశాల హెచఓడిలు, ఇంచార్జీలు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ ప్లేస్మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మునగనూరు భూములపై బి ఆర్ ఎస్ ఆరోపణలు నిరాధారం: మల్‌రెడ్డి రామ్ రెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 9:–
రంగారెడ్డి జిల్లా మునగనూరు భూముల వ్యవహారంపై బి ఆర్ ఎస్ నేత మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన ఆరోపణలను రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ నాయకత్వం సూచనల మేరకు కిషన్‌రెడ్డి మునగనూరుకు వచ్చి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.
మునగనూరు సర్వే నంబర్ 44లో భూముల రిజిస్ట్రేషన్లు 2023లో జరిగాయని, అప్పట్లో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏదో ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. భూముల అంశం వెలుగులోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు ప్రభుత్వ భూములను గుర్తిస్తూ బోర్డులు ఏర్పాటు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని, భూముల కబ్జాలు తమ విధానం కాదన్నారు. అవసరమైతే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతామే తప్ప అక్రమాలకు పాల్పడబోమని స్పష్టం చేశారు. ఫార్మాసిటీ భూములు, ఇబ్రహీంపట్నం బస్‌డిపో సమీప భూములు, మునగనూరు తదితర ప్రాంతాల్లో గతంలో జరిగిన భూవివాదాలపై కూడా ఆయన ప్రస్తావించారు.
అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌పై జరిగిన పెట్రోల్ దాడి ఘటనకు భూ వివాదాలే కారణమని ఆరోపించిన రాంరెడ్డి, గత 14 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రభుత్వ భూములను కాపాడేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నిరాధార ఆరోపణలు కొనసాగిస్తే సహించబోమని, కిషన్‌రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం

## – డిఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్




హైదరాబాద్ ఎస్టేట్ జులై 08
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని పల్లె దవాఖాన సుందరంగా తీర్చిదిద్దారు ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ ఈ పల్లె దావకణలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఏంకాస్ (నేషనల్ క్వాలిటీ ఎన్స్యూరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడానికి పల్లె దవకానికి వచ్చిన ప్రజలందరికీ ఆహ్లాదకరంగా వాతావరణం ఏర్పడాలని అన్ని వైద్య టెస్టులు నాణ్యమైన సేవ మెరుగైన వైద్యం అందించాలని ఈ యొక్క పల్లె ధావకాను ఏర్పాటు చేయడం జరిగింది అందులో భాగంగా నేషనల్ లెవెల్ లో ఈరోజు తమిళనాడు నుంచి ఇతర ప్రాంతాల నుంచి వారు ఇక్కడి పల్లె దావకాన గూర్చి విచారిస్తున్నారు ఇక్కడి వాతావరణం ప్రజలకు అందించే సేవ పల్లె దవాఖాన లో ల్యాబ్ అన్ని నాన్స్ ప్రకారం అన్ని కరెక్ట్ గా ఉన్నాయా అని విచారిస్తున్నారు ఈ పల్లె దావకణలో త్రాగునీరు ఉందా, 105 రకాల మందులు ఉన్నాయా, ఇక్కడున్న సిబ్బంది వచ్చిన పేషెంట్స్ తో ఎలా మాట్లాడుతారు అని వారు విచారణ చేపట్టడం జరిగింది ఈ యొక్క ప్రోగ్రాం లో సెలెక్ట్ అయితే ఏంకాస్ లో సెలెక్ట్ అయితే సెంట్రల్ గవర్నమెంట్ నుంచి రెండు నుంచి మూడు లక్షల వరకు పల్లె దవాఖాన డెవలప్మెంట్ కోసం ఇవ్వడం జరుగుతుందని డీఎంహెచ్వో డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు.అలాగే ఈ సీజన్ లో ఇంటి పరిసరాల ను శుభ్రంగా ఉంచుకోవాలని, కూలర్, కుండా లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి మిరికి నీరు వలన దోమలు ఏ నీటి లో గుడ్లు పెడతాయి దోమలవలన మలేరియా, డెంగ్యూ, టైపాయిడ్ ఇతర అనారోగ్యం వస్తుంది అని తెపలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిల్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అవెంజలిన్, డాక్టర్ లక్ష్మి ప్రసన్న, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ పి ప్రశాంత్, డిస్టిక్ క్వాలిటీ అశ్యురను మేనేజర్ రాజ్ కుమార్, మౌనిక ఎం ఎల్ ఎచ్ పి, ఎఎన్ఎంలు, ఆశలు మరియు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
10 శుక్రవారం జూలై 2026

# మతం మార్చుకోవాలని అమ్మానాన్నను ఒత్తిడి చేశారు

## – పోలీసుల విచారణలో కుమారులు..

## – మత మార్పిడి మాఫియా ఖాతాలో మరో జంట బలి..

## – ఘట్కేసర్ లో రైలుకింద పడి మృతిచెందిన దంపతుల కేసులో.. వెలుగులోకి వస్తున్న విస్తుపోయే విషయాలు

ఐదు రోజుల క్రితం ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న రవికుమార్, శిరీష దంపతుల కేసులో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వారు ఆత్మహత్య చేసుకోవడానికి పక్కింటి దంపతులే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. మతం మార్చుకోవాలని వారు చేసిన ఒత్తిడి, అది కుదరకపోవడంతో పెట్టుబడి పేరుతో రూ20లక్షలు తీసుకొని రిటర్న్ ఇవ్వకపోవడం వంటి కారణాలతోనే రవికుమార్ దంపతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ మేరకు రవికుమార్ కొడుకులు సుశాంత్, విద్వాన్స్‌లతో పాటు శిరీష తల్లిదండ్రులను పోలీసులు విచారించే సమయంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

÷మత మార్పిడి విషయమై ఇంట్లో గొడవలు÷


బియ్యం వ్యాపారం చేసుకుంటూ, సొంత ఇల్లు కొనుక్కొని ఇద్దరు కుమారులతో సంతోషంగా ఉంటున్న కుటుంబంలో పక్కింటి దంపతులు మతం మార్పిడి పేరుతో చిచ్చు పెట్టారు. పక్కింట్లో ఉంటున్న వెంకట్, ప్రమీల కుటుంబంతో రవికుమార్, శిరీషకు మంచి పరిచయం ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని వెంకట్ ప్రమీలలు.. రవికుమార్ ఇంటికి వచ్చిన ప్రతీసారి మతం మార్చుకొని ప్రతీ ఆదివారం చర్చికి రావాలని ఒత్తిడి చేసేవారు. మృధు స్వభావి అయిన రవికుమార్.. అప్పుడప్పుడు తన భార్య శిరీషతో కలిసి వెంకట్ మాట కాదనలేక ప్రార్థనకు వెళ్లేవారు. అయినా తమ మతంలోకి రావాలని వెంకట్, ప్రమీల దంపతులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. మారడం తనకు ఇష్టం లేదని శిరీష తెగేసి చెప్పింది. రవికుమార్ మతం మారుదాం అంటూ భార్యకు నచ్చజెప్పేవాడు. ఈ క్రమంలో వారి మధ్య అప్పుడప్పుడు వాగ్వాదం జరిగేది.

÷రూ. 20లక్షలు పెట్టుబడి పెట్టించి..÷

మతం మారడం ఇష్టం లేదని గుర్తించిన వెంకట్, ప్రమీల దంపతులు.. మరో పథకం వేశారు. రెడీమిక్స్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని వారిని నమ్మించారు. ఎలాగూ మతం మారలేదు కదా.. కనీసం పెట్టుబడి పెడదామని రవికుమార్ దంపతులు నిర్ణయించుకున్నారు. రెడీమిక్స్ వాహనం కొనుగోలు చేసేంత వరకు వెంకట్, ప్రమీల దంపతులు వారిని వదిలిపెట్టలేదు. వాహనం కొంటే ప్రతి నెలా రూ. 20వేలు ఆదాయం ఇంటికి వస్తుందని నమ్మబలికారు. దాంతో రవికుమార్ తన భార్య నగలను తాకట్టుపెట్టి రూ. 20 లక్షలతో వాహనం కొని వెంకట్ ప్రమీలకు అప్పగించారు. రూ. 20 వేల చొప్పున రెండు మూడు నెలలు మాత్రమే ఇచ్చి ఆ తర్వాత ఇవ్వడం మానేశారు. దీంతో బ్యాంకులో ఉన్న బంగారానికి వడ్డీ కట్టలేకపోతున్నామని రవికుమార్, శిరీష మదనపడేవారు.

÷అంతలోనే ఆత్మహత్య..÷

పక్కింటి దంపతులతో గొడవ పెట్టుకోలేక, వారి పైశాచికత్వాన్ని భరించలేక రవికుమార్ దంపతులు సొంతిల్లు ఖాళీ చేసి వేరే చోటుకు మారాలని



నిర్ణయించుకున్నారు. సామానులన్నీ మూటలు కట్టి పెట్టారు. ఆ తర్వాత ఏమైందో ఏమో గానీ ఆ రోజు సాయంత్రం (జూలై-2న) ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలోకి వెళ్లారు. ఆత్మహత్యకు ముందు పక్కింటి వెంకట్‌తో సుమారు అరగంట సేపు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసుల విచారణతో తేలింది. ఆ తర్వాత రవికుమార్, శిరీష దంపతులు ఒకరినొకరు హత్తుకొని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. వారు చనిపోయిన విషయం తెలిసిన వెంటనే పక్కింట్లో ఉండే వెంకట్, ప్రమీల దంపతులు ఇంటకి తాళం వేసి పరారయ్యారని పోలీసులు తెలిపారు.

ఆంధ్రాలో కూడా హిందువులు రాముడి దేవాలయం కట్టుకోవడానికి ప్రయత్నించినపుడు జరిగిన దాడి కూడా తెలిసిందే.. ఈ సమస్య ఎంత జఠిలంగా మారుతుందో ప్రభుత్వాలు గమనించాలి..

# సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ యూనిట్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 9:- రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ఏర్పాటు చేసిన అత్యాధునిక సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం యూనిట్‌లోని ఉత్పత్తి విభాగాలను పరిశీలించి తయారీ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ, "తెలంగాణ రైజింగ్2047" విజన్‌తో రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించేందుకు పారిశ్రామిక అనుకూల విధానాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. సౌరశక్తి వంటి స్వచ్ఛ ఇంధన రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రీమియర్ ఎనర్జీస్ వంటి సంస్థలు మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరారు. పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్‌కు సీఎం ఆదేశించారు.

అర్హులకు ఇంటి పట్టాలు, ఉపాధి అవకాశాలు, వ్యాపార సముదాయాల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణను దేశంలో ప్రముఖ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కేవలం 12 నెలల్లో 75 ఎకరాల్లో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసిన ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థను అభినందించారు.

ఈ కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి పిలుపు




హన్మకొండ, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేయాలని సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీన్‌దయాళ్‌నగర్‌లోని యుటిఎఫ్ భవన్‌లో 31వ డివిజన్ పార్టీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశం ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలతో ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతోందని ఆరోపించారు. కుల, మత రాజకీయాలతో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో సమర్థ చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్, కారు ఉపేందర్ మాట్లాడారు. జంపాల రమేష్, ఇస్లావత్ రవీందర్, ఎస్కే లతీఫ్, దూడపాక రాజేందర్, జగనాల ఉప్పలయ్య, దార్నా ప్రభాకర్, వంగ సదానందం, పెండ్యాల లక్ష్మణ్, నేతకాని భారతి, ఇనుముల వనమాల, రేణికుంట్ల మయూరి, కాబట్టి కేతమ్మ, కురుకు రజిత, పిండి జజ్జాలు, చెరుపెల్లి కుమారస్వామి, గజవెల్లి మొగిలి, బచ్చు భాగ్యలక్ష్మి, సరూప, వెంకన్న, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మరో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

## తొలిసారిగా టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ (THR)



హైదరాబాద్ ఎస్టేట్ జులై 09 మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ డివై సీఎంఓ డా. మధు కుమార్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మరో అరుదైన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఇటీవల ఇదే ఆసుపత్రిలో టోటల్ నీ రీప్లేస్‌మెంట్ (టి కె ఆర్ ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందం, నేడు ఆసుపత్రి చరిత్రలో తొలిసారిగా టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ (టి ఎచ్ ఆర్) శస్త్రచికిత్సను కూడా విజయవంతంగా పూర్తి చేసి మరో మైలురాయిని సాధించింది. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సుహాసిని మరియు డాక్టర్ నరేష్, అనస్తిష్య డాక్టర్ మైత్రియా నిపుణుల బృందంతో కలిసి విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స పొందిన రోగి ఐలయ్య, శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది , వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు అని తెలిపారు. ఇప్పటికే టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి, ఇప్పుడు తొలిసారిగా టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను కూడా విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు అత్యాధునిక ఆర్థోపెడిక్ వైద్య సేవలను అందించే కేంద్రంగా మరోసారి తన సామర్థ్యాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా డివై సీఎంఓ డా. మధు కుమార్ మాట్లాడుతూ, రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను మరింత విస్తరించి, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. మందమరి జిఎం రాధాకృష్ణ మరియు సీఎంఓ కిరణ్ రాజ్ సహకారం ఆసుపత్రి అభివృద్ధిలో ఉందన్నారు ఈ శస్త్రచికిత్సవిజయవంత మైనదని తెలిపారు.

# ఎంపీ పటేల్ గూడా డ్రైవర్ అనుమానాస్పద మృతి..

## పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 9:- ఇబ్రహీంపట్నం మండలం ఎంబి పటేల్‌గూడలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కృషి ఇలయ్య (47) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై మృతుడి అక్క, మంచాల గ్రామానికి చెందిన రావుల లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, ఇలయ్య 2010లో జ్యోతిని వివాహం చేసుకోగా, అప్పటి నుంచి దంపతుల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరిగేవని పేర్కొన్నారు. అలాగే ఇలయ్య షుగర్, రక్తపోటు సమస్యలతో కూడా బాధపడుతున్నట్లు తెలిపారు. ఈరోజు ఉదయం సుమారు 7:30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఇలయ్య మృతిచెందినట్లు సమాచారం ఇచ్చాడని లక్ష్మమ్మ వెల్లడించారు. అనంతరం అక్కడికి చేరుకుని చూడగా మృతదేహంపై అనుమానాలు కలిగే పరిస్థితులు కనిపించాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి అసలు నిజాలు వెలికితీయాలని పోలీసులను కోరారు. లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం (ప్రీవిజు) నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల అసలు కారణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# నూతన దంపతులకు ఏబీఆర్ కానుక





గీడుగొండ, జూలై 9 హైదరాబాద్ ఎస్టేట్: మనుగొండలో జరిగిన రెండు వివాహ వేడుకల్లో అల్లం బాలకిషోర్ రెడ్డి (ఏబీఆర్) తరఫున నూతన వధూవరులకు ఆత్మీయంగా వివాహ కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తుప్పరి బుచ్చమ్మనర్సయ్య దంపతుల చిన్న కుమారుడు తుప్పరి రంజిత్ కుమార్ సిరి శైలజ వివాహ వేడుక సందర్భంగా అల్లం మర్రెడ్డి ఆదేశాల మేరకు అల్లం బాలకిషోర్ రెడ్డి తరఫున వివాహ కానుకను అందజేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. అలాగే మర్రి నీలామల్లేష్ దంపతుల ఏకైక కుమారుడు డాక్టర్ మర్రి మనోజ్ కుమార్ నక్షత్ర వివాహ వేడుకలో కూడా అల్లం బాలకిషోర్ రెడ్డి తరఫున వివాహ కానుకను అందించి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అల్లం బాలకిషోర్ రెడ్డి కార్యకర్తలు నూతన దంపతులను ఆత్మీయంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, సంఘాల నాయకులు, యువకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం..
## మరో గురుకులంలో ఫుడ్ పాయిజన్..




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి తిరిగి అశోక్

- నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన

- అస్వస్థతకు గురైన ఉదయం అల్పాహారం తిన్న 26 మంది విద్యార్థులు .. బెడ్లు లేక నేలపైనే చికిత్స అందించిన వైనం

- పేద విద్యార్థులంటే ఎందుకింత చిన్నచూపు రేవంతు రెడ్డి

- బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

# ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా తెలంగాణ..

## గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ప్రారంభం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 9:-
హైదరాబాద్: గచ్చిబౌలి స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌తో పాటు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (Y్రూజుూఖ)ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ లోగో, అధికారిక వెబ్‌సైట్, ఫిజికల్ లిటరసీ మిషన్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ ఫెలోషిప్, అకడమిక్ కోర్సులను ప్రారంభించగా, పారా అథ్లెట్ల కోసం నేషనల్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పారా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో, యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు వీ దీష్మితీఫ్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. అలాగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026, హాకీ ఇండియా లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్, ప్రపంచ పికిల్‌బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్ వంటి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణను ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ, ఉద్యోగ అవకాశాలు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. 2028 నాటికి తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీని కూడా ప్రారంభిస్తామని ప్రకటించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు క్రీడా రంగాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించారు.

# మాల సమాజ ఐక్యతకు వేదికైన వివాహ వేడుక

### గీసుకొండ ఓంకార్ ఫంక్షన్ హాల్‌లో తుప్పరి రంజిత్ కుమార్ వివాహానికి జాతీయ, రాష్ట్ర, మండల నాయకుల ఘన హాజరు






గీసుగొండ, జులై 9 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన మాల సోదరుడు తుప్పరి రంజిత్ కుమార్ వివాహ వేడుక గీసుకొండలోని ఓంకార్ ఫంక్షన్ హాల్లో వైభవంగా జరిగింది. మాల సమాజ ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలిచిన ఈ శుభ వేడుకకు మాల కుల సంఘం జాతీయ, రాష్ట్ర, మండల స్థాయి నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాల సోదరులు, పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.
ఈ సందర్భంగా మాల కుల సంఘం జాతీయ నాయకుడు బండి అశోక్, రాష్ట్ర నాయకులు డాక్టర్ తుప్పరి నరసింహస్వామి, దండు మోహన్, వంగేటి రాజమౌళి, బండి రజనీకర్, వేముల రమేష్, గీసుకొండ మండల నాయకుడు నాంపల్లి శ్రీనివాస్ తదితరులు నూతన దంపతులను కలిసి అభినందించి, వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి ఐక్యతే బలమని, పరస్పర సహకారం, సోదరభావంతో ముందుకు సాగినప్పుడే సమాజం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి శుభ కార్యక్రమాలు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సమాజంలో ఆత్మీయతను పెంపొందిస్తాయని అన్నారు. వివాహ వేడుకలో నాయకులు, బంధుమిత్రులు, మాల సోదరులు నూతన దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
గీసుకొండలోని ఓంకార్ ఫంక్షన్ హాల్ శుభాకాంక్షలు, ఆత్మీయ పలకరింపులు, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.
మాల సమాజ నాయకులు ఒకే వేదికపై కలుసుకొని నూతన దంపతులను ఆశీర్వదించడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాల సమాజ ఐక్యత, పరస్పర ఆత్మీయత, సామాజిక బంధాలను ప్రతిబింబించిన ఈ వివాహ వేడుక హాజరైన ప్రతి ఒక్కరిపై మధురమైన ముద్ర వేసింది.

# డప్పు దరువు ఆదిమ గుండె చప్పుడు

## డప్పు దరువుతో లక్షల గుండెలను ఆకట్టుకుంటున్న డప్పు మహేందర్



అడవి ఆకు కదిలిన శబ్దంలో
ఆదిమ మనిషి మొదట వినింది
తన గుండె చప్పుడు.
ఆ గుండె చప్పుడే
కాలంతో డప్పు అయ్యింది.
మాదిగ గూడెం మట్టిలో
చర్మానికి జీవం పోసే చేతుల్లో
వృత్తి కాదు అది
వంశపారంపర్య శ్వాస.
ఎండలో ఎండిన తోలు
చంద్రుడి కాంతిలో మృదువై
మ్రోగే గుండెగా మారినప్పుడు
ఒక వాద్యం కాదు పుట్టింది
ఒక జాతి చరిత్ర మేలుకుంది.
డప్పు గొడుగు కట్టిన నడుము
వీరుడి కవచంలా మెరుస్తుంది
భుజం మీద తగిలే ఆ బిగింపు
యుద్ధానికి సిద్ధమైన వీరుని తాటికట్టులా.
కర్ర దెబ్బ కాదు అది
కాలాన్ని లేపే ఆజ్ఞ.
వేళ్ల సవ్వడి కాదు అది
భూమి శ్వాసను మేల్కొలిపే మంత్రం.
ఒక చేయి పిడికిలి దరువు
మరొక చేయి పలుకు దరువు
మధ్యలో గాలి కంపిస్తుంది
ఊరు మొత్తం ఒకే హృదయంగా మారుతుంది.
పండుగ మొదలు పెట్టేది డప్పే
పోరాటం పిలిచేది డప్పే
చావు వార్త చెప్పేది డప్పే
పుట్టిన శిశువుకు జీవ గీతం పలికేది కూడా డప్పే.
అది శబ్దం కాదు
సందేశం.
అది వాద్యం కాదు
సంఘ చరిత్ర.
ఆదిమ అరణ్యాల్లో
వేటకు పిలుపై మ్రోగిన దరువు
నేడు సభలలో న్యాయం అడుగుతుంది.
ఒకప్పుడు గిరిజన జాడలో
మ్రోగిన రిథమ్
ఇప్పుడు సమానత్వ నినాదంగా మారింది.
డప్పు చర్మం మీద పడే ప్రతి దెబ్బ
వేదన కాదు
అవమానాల మీద గెలిచిన గర్వ గర్జన.
ప్రతి దరువు చెబుతుంది:
“మేమున్నాం
మేమే ఈ నేల గుండె చప్పుడు.”
డప్పు మ్రోగితే
కాలం ఆగి వింటుంది
భూమి తల ఎత్తి చూస్తుంది
చరిత్ర తలవంచి గౌరవిస్తుంది.
మాదిగ గూడెం డప్పు
భూమి గుండె కొట్టుకునే శబ్దం.

రమేష్ దారమళ్ళ

# కొల్లాపూర్ పీజీ కళాశాల విద్యార్థిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

## బాధిత విద్యార్థికి న్యాయం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కొల్లాపూర్
కొల్లాపూర్ పీజీ కళాశాలలో చదువుతున్న ఒక విద్యార్థి (రాము) పై చదువుల నిమిత్తం అవసరమైన టి.సి., మెమోలు మరియు ఇతర విద్యా ధ్రువపత్రాలు తీసుకోవడానికి కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా, సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పి నిన్న సాయంత్రం తన గదికి రావాలని సూచించినట్లు బాధిత విద్యార్థి తెలిపాడు.
విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి సమయంలో ప్రిన్సిపాల్ తన గదికి పిలిపించి, అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధించడానికి ప్రయత్నించాడని ఆరోపించాడు. తనపై బలవంతం చేయడానికి యత్నించగా, ఆ పరిస్థితి నుండి తప్పించుకోవడానికి తీవ్ర ప్రతిఘటన చేసి అక్కడి నుండి బయటకు పరుగెత్తి ప్రాణాలు దక్కించుకున్నట్లు విద్యార్థి వెల్లడించాడు.
ఈ ఘటన అనంతరం బాధిత విద్యార్థితో పాటు పలువురు పీజీ విద్యార్థులు కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయితే, అప్పటికే ప్రిన్సిపాల్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపినట్లు సమాచారం.
ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థి, యువజన సంఘాలైన ూాxూాఖీ, ూాఖీx, ఖ్ఖీx ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం కొల్లాపూర్ పట్టణంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాధిత విద్యార్థికి వెంటనే న్యాయం చేయాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాలల్లో విద్యార్థుల భద్రతకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.
ధర్నా సందర్భంగా పోలీసులు జోక్యం చేసుకుని, బాధిత విద్యార్థికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థిని తదుపరి విచారణ కోసం సంబంధిత అధికారుల వద్దకు తరలించినట్లు తెలిపారు.
ఈ సందర్భంగా సంబంధిత విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌తో పాటు యూనివర్సిటీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలతో సమావేశమయ్యారు. సంఘటనపై పూర్తి స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి వాస్తవాలను వెలికితీసి, నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన మరియు పరిపాలనా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అదేవిధంగా పీజీ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి, మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు, గతంలో విద్యార్థుల నుంచి వసూలు చేసిన అనవసర రుసుములపై కూడా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసినట్లయితే తిరిగి చెల్లించే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల భద్రతకు భంగం కలిగించే ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. బాధిత విద్యార్థికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాలల్లో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని, విశ్వవిద్యాలయ అధికారులను డిమాండ్ చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
10 శుక్రవారం జూలై 2026

# కెసిఆర్ ఫ్యామిలీ ప్యాకేజిగా కాళేశ్వరాన్ని ఉపయోగించుకున్నారు..

## కెసిఆర్ కుటుంబం అంత ఇంజనిర్లే..

## కాళేశ్వరం పేరుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులను మోసం చేశారు..

## మా ప్రభుత్వం రైతు ప్రభుత్వం..

## 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చాం..

## ప్రాణహిత కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలోనే ప్రాణం పోశారు..

## - ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు...

హైదరాబాద్ అసెంబ్లీలోని సిఎల్పీ కార్యాలయంలో గౌరవ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు మీడియా సమావేశం నిర్వహించారు.

మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు మాట్లాడుతూ...




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కరీంనగర్.

గత కొన్ని రోజుల నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేటిఆర్, హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలకు సంబందించి కేటీఆర్ గారు కన్నెపల్లి నుండి మోటార్లు ఓపెన్ చేసి నీరు ఇవ్వచ్చు నీళ్లు ఎత్తిపోయడానికి అవకాశం ఉందని కాళేశ్వరం ద్వారానే నీళ్లు వస్తాయనే విధంగా తెలంగాణ రాష్ట్ర రైతంగాన్ని ముఖ్యంగా ఉత్తర తెలంగాణ కరీంనగర్ రైతులను తప్పుదోవపట్టించడం సరికాదని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డి, అన్నారం, సుందిళ్ల 1 లక్ష 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మాణం చేసిన కూడా వాస్తవానికి ఏ ఒక్క రైతుకు కూడా ప్రయోజనం జరగలేదని ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో డా. వై.యస్ రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జలయజ్ఞ కార్యక్రమంలో భాగంగా ప్రాణహిత ప్రాజెక్టు జీవం పోసుకొని మహారాష్ట్ర సరిహద్దులో ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నటువంటి తుమ్మిడిహెట్టి నుండి ఆనాడు ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు నీళ్లను తీసుకొని అక్కడి నుండి కరీంనగర్,మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల వరకు 16 లక్షల 40 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని ఆనాడు 38 వేల కోట్ల రూపాయల నిధులతో డి.పి.ఆర్ తయారు చేయడం జరిగిందని గుర్తు చేశారు. 2014 లో తెలంగాణ రాష్ట్రం అవతరించిన తరువాత బిఆర్ఎస్ పార్టీ అప్పుడు ఉన్న ముఖ్యమంత్రి కెసిఆర్ గారు ఆనాడు 152 మీటర్లు కావాలని అడగటం జరిగింది. 2012సంవత్సరంలో కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 148 మీటర్లకు అయితే మాకు ఎలాంటి అభ్యతరం లేదు అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చాహ్వాన్ గారు కూడా అంగీకారం తెలిపారు. చాలా సంవత్సరాలు తర్జనబర్జన జరిగినప్పటికీ ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆనాటి ప్రభుత్వం దాదాపు 5 వేల 523 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కెసిఆర్ గారు దాదాపు 6 వేల కోట్ల పైచిలుకు ఖర్చు చేసి మొత్తం 11 వేల 670 రూపాయలు ఖర్చు చేసిన తరువాత ఈ ప్రాజెక్టు పనికి రాదు ఏం లాభం లేదు అని చెప్పారు. 38 వేల కోట్లు ఖర్చు పెట్టి ఉమ్మడి జిల్లాలను శాస్యశమలం చేయవచ్చు అని చెప్పి ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు రూపాకల్పన చేస్తే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించడంతో ఉమ్మడి కరీంనగర్ మిడ్ మానేరు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిర్మాణం చేసుకొని 2013-14లో ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రారంభించిన తరువాత వీటికి సంబందించిన పనులన్ని తుంగలోకి తొక్కి 11 వేల 670 కోట్ల రూపాయలు ఖర్చు చేసిన తరువాత ప్రాణహిత, చేవేళ్లను కేసీఆర్ పక్కన పెట్టాడు..రీ డిజైన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును మొదలు పెట్టి ఏటీఎంగా మార్చుకున్నారు అలాగే ఫ్యామిలీ ప్యాకేజీగా కాళేశ్వరాన్ని ఉపయోగించుకున్నారని తెలిపారు మరియు బీఆర్ఎస్ హయాంలో నాలుగేళ్లలో కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన నీళ్లు162 టీఎంసీలు మాత్రమే అని ఇందులో 63 టీఎంసీలను తిరిగి నదిలోకి వదిలేయడం జరిగిందని నికరంగా కాళేశ్వరం నుంచి ఎత్తిపోసింది కేవలం 74 టీఎంసీలు మాత్రమేనని అలాగే ఎల్లంపల్లి నీళ్లను కూడా కాళేశ్వరం నీళ్లుగా చూపించడం జరిగింది పెద్ద ఇంజనీర్ కేసీఆర్ అయితే, చిన్న ఇంజనీర్ హరీష్ రావు అవతారం ఎత్తి కోట్ల రూపాయలు దండుకున్నారు మరియు మానేరు గేట్లు ఎత్తితే ఆ నీళ్లు కూడా కాళేశ్వరం నీళ్లు అని చెపుకున్నారు. ప్రపంచంలోనే 8 వ వింతగా కాళేశ్వరం పేరు చెప్పి రైతులను మోసం చేసిన ఘనత బిఆర్ఎస్ నాయకులది అని అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు పనికి రావని ఎన్ డీఎస్ ఏ రిపోర్ట్ ఇచ్చింది.. 2023 అక్టోబర్ లో మేడిగడ్డలో 19వ పిల్లర్ కుంగిపోయింది.

నవంబర్ 1న ఎన్డీఎస్ ఏ తెలంగాణ ప్రభుత్వానికి కాళేశ్వరంపైన నివేదిక ఇచ్చింది. నివేదిక బయటకు రాకుండా అప్పటి ప్రభుత్వం కప్పిపెట్టింది. మేడిగడ్డ వైపు ఎవరిని వెళ్లనివ్వకుండా దాచి పెట్టే ప్రయత్నం చేశారు. రాష్ట్ర రైతులను మోసం చేసిన వాళ్లే ఇప్పుడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడు.

హరీష్ రావు రోజుకి 100 అబద్దాలు చెప్పకపోతే నిద్రపట్టదు. బీఆర్ఎస్ హయాంలో కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోతే వందల కోట్లు ఖర్చు పెట్టి బాగు చేశారు. కనీసం లక్ష ఎకరాలు కూడా కాళేశ్వరం నీళ్లతో సాగు కాలేదు. కాళేశ్వరం సర్వరోగ నివారిణి, కోటీ ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇస్తామని చెప్పుకున్నారు. కాళేశ్వరం నుంచి ఏ నియోజకవర్గానికి ఎన్నీ నీళ్లు ఇచ్చారో శ్వేత్ర పత్రం విడుదల చేయాలి. ప్రతి నియోజకవర్గం వెళ్లి కాళేశ్వరం నీళ్లు ముద్దాడాయి అని హరీష రావు చెప్పుకున్నారు.

గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలనే కాళేశ్వరం నీళ్లు ముద్దాడాయి. బీఆర్ఎస్ నాయకుల మోసకారి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. కాళేశ్వరం కోసం కేసీఆర్ తెచ్చిన అప్పులో మా ప్రభుత్వం 33,574 కోట్ల రూపాయలతో పాటు 417 కోట్ల రూపాయలను వడ్డీగా చెల్లించాం. ఎత్తిపోసిన 74 టీఎంసీల నీళ్ల కోసం తొమ్మిది వేల కోట్ల విద్యుత్ ఛార్జీల కింద చెల్లించాం. తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజీ కడితే ఇందులో సగం బిల్లు కూడా వచ్చేది కాదు. గతంలో కూడా వర్షాలు రాలేదు, నీళ్లు రాలేదని ఎల్ ఎండీ కి వెళ్లి బీఆర్ఎస్ నాయకులు ఫోటోలు దిగారు. వర్షాలు పడొద్దు, పంటలు పడొద్దు. వెళ్లి మేం ఏడవాలన్నదే బీఆర్ఎస్ నాయకుల ఆలోచన అని రైతులు పూర్తిగా నాశనం కావాలన్నదే బీఆర్ఎస్ నేతల ఆలోచన అని అన్నారు . ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం అవగాహన కల్పిస్తోంది. రైతులను రెచ్చగొట్టాలన్నదే బీఆర్ఎస్ ప్రయత్నం. బీఆర్ఎస్ నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలను రైతులను నమ్మరు.

కాళేశ్వరంతో సంబంధం లేకుండా గత రెండున్నర యేళ్ల నుంచి పంటలు పండుతున్నాయని రైతులకు నీళ్లు ఇచ్చి మా ప్రభుత్వం అండగా ఉంది. మోటార్లు ఎలా ఆన్ చేయాలో కూడా బీఆర్ఎస్ నాయకులకు తెలియదు. మోటార్ల పెట్టే సమయంలో కంపెనీలతో మాట్లాడుకుని పర్సంటేజీలు, మోబిలైజేషన్ అడ్వాన్స్ లు తీసుకోవడమే బీఆర్ఎస్ నాయకులకు తెలుసు అని ఎద్దేవ చేశారు. మహారాష్ట్రలో మంచి వర్షాలు పడుతున్నాయి. నీళ్లు వస్తాయని మా ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని అన్నారు.

రైతుల కోసం మా ప్రభుత్వం బతుకుతోంది. 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చాం. .రైతు భరోసా ఇవ్వడం బీఆర్ఎస్ కు ఇష్టం లేదు అంటూ తుమ్మిడిహట్టిని మా ప్రభుత్వం పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారు. గ్రావిటీ ద్వారా నీళ్లు తెచ్చి ఎల్లంపల్లిలో పోస్తాం అని కాళేశ్వరంలో బ్యారేజీల రక్షణే మా ఉద్దేశం అని తెలిపారు. కేసీఆర్ కుటుంబం అంతా ఇంజనీర్లే అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన చెక్ డ్యాంలు అన్ని కొట్టుకుపోయాయి కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు లాంటి ప్రాజెక్టులు ఇప్పటికి చెక్కు చెదరలేదు అని అన్నారు. ప్రాజెక్టులపైన మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదని విమర్శించారు. ఎల్ నీనో ప్రభావం ప్రపంచం అంతా ఉంది దీన్ని కూడా బిఆర్ఎస్ నాయకులు రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటు అని తెలిపారు.

# తుమ్మలూర్ రోడ్ లో ఘోర రోడ్డు ప్రమాదం ఆటో బోల్తా



హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 9

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామం నీకే చెందిన శ్రావణి 30 సంవత్సరాలు ఫ్లాప్సిటిలో పని ముగించుకొని మహేశ్వరం నుండి తుమ్మలూరు రహదారిపై ఆటో బోల్తా పడి తుమ్మలూరు కి చెందిన శ్రావణి హాస్పిటల్ కి తీసుకు వెళ్తుండగా మృతి చెందడం జరిగింది

# కోహెడలో రూ.47 కోట్ల చేపల మార్కెట్‌కు రేపు శంకుస్థాపన



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 9:- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు శుక్రవారం ఉదయం 8 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని భూమిపూజ నిర్వహించనున్నారు.అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకోనున్న ఈ మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజ్, శిక్షణా కేంద్రం, క్యాంటీన్, అడ్మినిస్ట్రేషన్-కమ్-ట్రైనింగ్ హాల్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే నాణ్యతా ప్రమాణాలతో ప్రత్యేక చేపల ఎగుమతి ప్రాసెసింగ్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. రోజుకు 200 మెట్రిక్ టన్నుల చేపలను నిర్వహించే సామర్థ్యంతో ఈ మార్కెట్ పనిచేయనుండగా, సంవత్సరానికి సుమారు రూ.553 కోట్ల వ్యాపారం జరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 280 మందికి ప్రత్యక్షంగా, సుమారు 1,100 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. డిజిటల్ నిర్వహణ వ్యవస్థ, ఈ-కామర్స్, మొబైల్ యాప్, బ్లాక్‌చైన్ ట్రేసబిలిటీతో పాటు సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా ఈ మార్కెట్‌ను ఆధునిక, పర్యావరణహిత కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు.

# గంగారం సర్పంచ్ దేవేందర్ నాయక్ చేతులమీదుగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం





హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 9

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గంగారం గ్రామంమునవత్ బుజ్జి నీల్య నాయక్ నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

రెబ్బెన కట్ చేసి ఓపెన్ చేయడం జరిగింది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామాలలో ఇంద్రమ్మ ఇల్లు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రతి ఒక్క పథకాలు గ్రామ ప్రజలకు చేరే విధంగా సర్పంచులు పనిచేయాలని ఉచిత బస్సు గాని ఉచిత కరెంటు గాని ఇంద్రమ్మ ఇల్లు గాని రైతుబంధు రైతులకు రెండు లక్షల రుణమాఫీ పల్లె పల్లెకు పథకాలు అందియాలని మహేశ్వరం నియోజవర్గం ఇంచార్జ్ అయిన ఎక్స్ ఎమ్మెల్యే కే ఎల్ ఆర్ ఆధ్వర్యంలో మహేశ్వరం మండలం ముందడుగులో డెవలప్మెంట్ ప్రతి ఒక్క విలేజ్లో ఉపయోగించుకోవాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది గ్రామ ప్రజలు ఓటర్ ఐడి ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని గ్రామ ప్రజలకు మనవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఉపసర్పంచ్ మహేందర్ విలేజ్ సెక్రటరీ మహేష్ వార్డ్ మెంబర్స్ ఏం రవి ఏం మోహన్ నాయక్ ఎం ధర్మ ఎం దేవా కే రాజు జ్యోతి గోపి లావణ్య శ్రీనివాస్ బుజ్జి నీలియ ఎం రాజా ఎం శ్రీనివాస్ ఎం శాంతి గ్రామ పెద్దలు పాల్గొన్నారు







